క్లుప్తంగా

మున్నూరుకాపు మిత్రమండలి కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

భైంసాటౌన్: మున్నూరుకాపు మిత్రమండలి భైంసా పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోర్బ గల్లిలోని సంఘ భవనంలో అధ్యక్షుడిగా గాలి రవి, ప్రధాన కార్యదర్శిగా పెద్దకాపు గజ్జారాం, కోశాధికారిగా కార్గం వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా రావుల పోశెట్టి, సంయుక్త కార్యదర్శిగా బొందెల శంకర్, పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని శాలువా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్నూరుకాపు కులస్తులు పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

భైంసాటౌన్: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి సహృదయత చాటుకున్నారు భైంసా పట్టణానికి చెందిన కొందరు యువకులు. వివరాల్లోకి వెళితే.. బాసరలో ఓ వృద్ధురాలు మృతి చెందడంతో పోలీసులు.. మృతదేహాన్ని భైంసాలోని ప్రభుత్వ ఏరియా స్పత్రికి తరలించారు. మృతురాలి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో.. మూడు రోజులుగా మార్చురీలోనే మృతదేహం పడి ఉంది. ఈవిషయం పట్టణంలోని ఐక్యతా సేవా సమితి ప్రతినిధులకు తెలుపడంతో ఆదివారం వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో వీరిని పలువురు అభినందించారు. ఐక్యతా సేవాసమితి, మార్పు కోసం మేము సైతం, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు గంగనీళ్ల జాతర ఏర్పాట్లపై సమీక్ష

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ గంగనీళ్ల జాతర సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద ఆయా శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నట్లు ఈఓ రమేశ్ తెలిపారు. ఈకార్యక్రమానికి ఆర్టీసీ, వైద్యం, పోలీస్ అధికారులతోపాటు ఆయా గ్రామాల నాయకులు హాజరు కావాలని కోరారు. జాతర ఏర్పాట్లు, అవసరమైన భద్రత, భక్తులకు రవాణా సౌకర్యం, పార్కింగ్, వైద్యశిబిరం ఏర్పాట్లు తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు




వంజర్‌లో మాట్లాడుతున్న నాయకులు

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి, ప్యారమూర్, వంజర్, మలక్‌చించోలి గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మ రాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రతి బూత్‌నుంచి 200 మందిని సభ్యులుగా చేర్చేలా ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాంరెడ్డి, కరుణసాగర్ రెడ్డి, ఎల్లన్న, కొరిపెల్లి రాజు, శ్రీనివాస్, కాల్వ నరేశ్, నవీన్, తదితరులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ

లోకేశ్వరం: మద్యం సేవించి నడిపితే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై దిగంబర్ అన్నారు. ఆదివారం మండలంలోని పంచగుడిలో వంతెన వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ వాహనాదారులు తమ వెంట అన్ని ధ్రువపత్రాలను ఉంచుకోవాలని పేర్కొన్నారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు ఉన్నారు.

అనారోగ్యంతో ఎఫ్‌ఏ మృతి



గైని రాందాస్ (ఫైల్)

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ గైని రాందాస్ (44) శనివారం అర్ధరాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం ఆయనను కుటుంబసభ్యులు భైంసాలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబానికి ఈజీఎస్ తరఫున అంత్యక్రియల కోసం రూ.20వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ సుధాకర్, ఎంపీవో ఎంఎ రహీం, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపూర్ వెళ్లేదెలా..!



పనులు అర్ధంతరంగా వదిలేయడంతో కంకరతో రాజాపూర్‌తండా రోడ్డు

- అసంపూర్తిగా బీటీ రోడ్డు
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- ఏడాదిగా నిలిచిన నిర్మాణ పనులు



రోడ్డు దుస్థితి

కుంటాల: మారుమూల ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రవాణా సౌకర్యం కల్పిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కుంటాల మండలంలోని ఓలా పంచాయతీ పరిధిలోని రాజాపూర్‌తండాకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం రాజాపూర్ తండాకు ఇన్‌ఫ్రాఇన్-11, ఐటీడీఏ నిధులు 1.16 కోట్లను మంజూరు చేసింది. ఓలా రోడ్డు నుంచి రాజాపూర్‌తండా వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించేందుకు 2023 మే నెలలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు కిలో మీటర్ల మేర కంకర, డస్ట్ వేసి మధ్యలోనే వదిలేశాడు.

పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్..

తమకు రోడ్డు వస్తుందని.. సంతోషించిన తండా వాసుల ఆశలు ఆవిరయ్యాయి. శంకుస్థాపన చేసినప్పటి నుంచి నెల రోజులు పనులు సాఫీగానే కొనసాగాయి. గతేడాది కురిసిన భారీవర్షాలతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. ప్రస్తుతం కంకర లేచి ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. గతేడాది నుంచి పనులు ముందుకు సాగడం లేదు.

తరచుగా ప్రమాదాలు..

నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతల్లో వర్షపునీరు నిలుస్తుండటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు బురదమయంగా ఉండడంతో వాహనదారులు కింద పడి గాయాలపాలవుతున్నారు. అత్యవసర వేళ ఆసుపత్రికి వెళ్లేటప్పుడు 108 వాహనం మొరాయిస్తుందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు నిలిపివేయడంతో సంబంధిత శాఖ అధికారులు నిధులు మంజూరు చేయడం లేదు. రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలని తండా వాసులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది..



రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని తెలిసి సంబురపడ్డాం. కానీ పనులు ఆగిపోవడంతో మళ్లీ పాత సమస్యే. తండా నుంచి కుంటాలలోని పాఠశాలకు పిల్లలు చదువుకునేందుకు వెళ్లే ఆటోలు మొరాయిస్తున్నాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది.

– చౌహాన్ అంగూరిబాయి, రాజాపూర్‌తండా

పనులు నిలిచిపోయాయి



నెల రోజుల పాటు రోడ్డు పనులు చకచకా కొనసాగాయి. వర్షం పడటంతో పనులను ఆపివేశారు. ప్రస్తుతం కంకర తేలి రోడ్డంతా గుంతలమయంగా మారింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పనులను వేగవంతం చేయాలి.

– చౌహాన్ తిరుపతి, రాజాపూర్‌తండా

పనులు పూర్తి చేసేలా చర్యలు

నిధుల్లేక రాజాపూర్‌లో బీటీ రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయిన మాట వాస్తవమే. నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేయించి ప్రయాణికుల కష్టాలను తొలగిస్తాం.

– ప్రదీప్ కుమార్, ఏఈ, ఐటీడీఏ

భారీ వర్షంతో దెబ్బతిన్న రోడ్డు

- రాకపోకలకు తప్పని పాట్లు
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా తాత్కాలిక రోడ్డు



బురదలో కూరుకుపోయిన వాహనాన్ని పొక్లెయిన్‌తో తీయిస్తున్న వాహనదారు

ఖానాపూర్: పట్టణ శివారు నుంచి దిలావర్‌పూర్ వెళ్లే మార్గంలో రెంకోనివాగుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. దీంతో మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు ఇరుకుగా, ప్రమాదకరంగా మారింది. చిన్న చిన్న వాహనాలు మినహా భారీ వాహనాలు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. గురువారం ఆ మార్గంలో వెళ్లిన ఓ లారీ రోడ్డు లేని కారణంగా తిరిగి వస్తూ బురదలో కూరుకుపోయింది. దీంతో వాహనదారుడు పొక్లెయిన్ సాయంతో వాహనాన్ని బురదలోంచి తీయించారు. ఈ మార్గంలో వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు సైతం కొద్ది రోజులుగా కుమురం భీం చౌరస్తా నుంచే వెళ్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి.. తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు చేయించాలని రోడ్డు పరిధిలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలి

ఖానాపూర్: పట్టణంలోని బస్టాండ్ నుంచి ఆస్పత్రికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు ఏర్పాటు చేసే ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని మాజీ ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యుడు అమానుల్లాఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మున్సిపల్ చైర్మన్ చొరవతో రోడ్డుకు ఇరువైపులా చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి.. 108 అంబులెన్సు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. మళ్లీ యథావిధిగా దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య సృష్టిస్తున్నారని.. సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

ఖానాపూర్: చుక్క ధర్మరాజు మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని గోసంపల్లె బ్రిలియంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించిన పోటీల్లో పాఠశాలకు చెందిన సురక్షిత్, ఉదయ్ బంగారు పతకం, రితీష్, అజయ్, వైష్ణవి వెండి పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ మనోహర్, పాఠశాల కరస్పాండెంట్ నాగ మొగిలి తెలిపారు.

అనుమతుల మాటున అక్రమ దందా



ఇష్టానుసారం మొరం తవ్విన ప్రాంతంలో ఏర్పడిన గుంతలు



పట్టుబడిన వాహనాలు

ఖానాపూర్: పట్టణంలోని డబుల్‌బెడ్ రూమ్ కాలనీ సమీపంలో ఉన్న భూముల్లో అనుమతుల మాటున అక్రమ మొరం దందా యథేచ్ఛగా సాగుతోంది. పొక్లెయిన్లతో తవ్వకాలు చేపట్టిన నిర్వాహకులు టిప్పర్లలో పెద్దఎత్తున మొరం తరలిస్తున్నారు. నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారి పక్కనున్న భూముల నుంచి అనుమతుల పేరిట జాతీయ రహదారి పనుల కోసం ఈ మొరం తరలిస్తున్నారు. ఈ దందాను నిర్మూలించాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇష్టానుసారం చేపట్టిన మొరం తవ్వకాలతో ఆ ప్రాంతం గుంతలమయంగా మారి ప్రమాదాలకు నెలవుగా మారుతుంది. ఈనెల 23న అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నట్లు తహసీల్దార్ శివరాజ్‌కు సమాచారం అందడంతో పొక్లెయిన్‌తో పాటు ఆయన వెళ్లి మూడు టిప్పర్లను పట్టుకున్నారు. అనుమతులు లేని మొరం దందాను నిలిపివేశామని.. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

బోటు షికారు..



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌ను ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు సందర్శించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ప్రాజెక్ట్‌లో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

కమ్మేసిన పొగమంచు..!



కుంటాల: మండలంలోని గ్రామాల్లో ఆదివారం పొగమంచు దుప్పటిలా కప్పేసింది. కుంటాలలో ఉదయం ఏడు గంటల వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.

పర్యావరణంపై పట్టింపేది..?



చెరువుగట్టుపై శకలాలు

నిర్మల్‌ఖిల్లా: వినాయక నిమజ్జనోత్సవాలు ముగిసి రోజులు గడుస్తున్నా.. చెరువుల్లోని వ్యర్థాలను తొలగించడం లేదు. జిల్లా కేంద్రంలో వినాయకసాగర్‌గా పిలుచుకునే బంగల్‌పేటచెరువులో వ్యర్థాలు, చెత్తాచెదారం కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. విగ్రహాల తయారీకి వినియోగించే చెక్కదుంగలు, రాడ్లను అధికారులు తొలగించడం లేదని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెరువులను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వవిద్యార్థులు

సారంగపూర్: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1998-99లో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సారంగపూర్ సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడిగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థులు తాము చేస్తున్న వృత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలు, తమ కుటుంబ నేపథ్యాలను వేదికపై అందరితో పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సాయిరాం, గఫార్, రవిరాజ్, గణపతిరెడ్డి, గోవింద్‌రావు, శేషాద్రిలను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు.

లక్ష్మణచాందలో సమావేశమైన 2004-05 బ్యాచ్ విద్యార్థులు



లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 19 ఏళ్ల తర్వాత కలువడంతో ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన గురువులను ఘనంగా సన్మానించారు.

కుంటాల: గురువులతో పూర్వ విద్యార్థులు



కుంటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం కుంటాల మున్నూరుకాపు సంఘ భవనంలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ముధోల్ : అష్టలో సమావేశమైన విద్యార్థులు



ముధోల్: మండలంలోని అష్ట గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పలువురికి సన్మానం

నిర్మల్‌రూరల్: సారంగపూర్ మండలం జౌలి గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోల ధర్మరాజ్ పదవి విరమణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని కూరన్నపేట్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో మధుసూదన్, టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పోశెట్టి, టీయూటీఎఫ్ నాయకులు మురళి మనోహర్‌రెడ్డి, తొడిశెట్టి రవికాంత్, వెంకట రమణారెడ్డి, ప్రేమ్ సాగర్, వహీద్‌ఖాన్, లక్ష్మిప్రసాద్ రెడ్డి, మొయిజుద్దీన్, దేవన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు..

కుంటాల: మండల కేంద్రంలో ఆదివారం ఇటీవల బదిలీపై వెళ్లిన కుంటాల ఏవో లింగారెడ్డి, ఏఈవో శ్రీధర్‌ను రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతులు దత్తాద్రి, రాఘవేందర్, రాకేశ్, సబ్బిడి గజేందర్, ఉదయ్, ముత్యం, సంతోష్ పాల్గొన్నారు.



కుభీర్‌లో సన్మానం పొందిన వారితో ఉపాధ్యాయులు

కుభీర్: మండల కేంద్రంలో ఆదివారం కుభీర్ మిత్రమండలి ఆధ్వర్యంలో పలువురిని సన్మానించారు. మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను, పీఆర్టీయూ యూనియన్ మండలాల అధ్యక్షులను, ఉద్యోగ విరమణ పొందిన కె.పోతన్నను ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ భైంసా, కుభీర్ మండలాల అధ్యక్షులు ఎస్.గంగాధర్, అరవింద్, పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన డి.సురేశ్, ఉత్తమ ఉపాధ్యాయులు కె.గణేశ్, పోశెట్టి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కుభీర్ మిత్రమండలి అధ్యక్షులు వి.నాగేష్, జగిత్యాల జిల్లా డీబీసీడబ్ల్యూ సాయిబాబా, బ్యాంక్ మేనేజర్ హన్మండ్లు, నాయకులు పి.లక్ష్మణ్, ఉపాధ్యాయులు సంగి రాజేశ్వర్, టి.గంగాధర్, సాయినాథ్, శంకర్ తదితరులు ఉన్నారు.